రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



### రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి : మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

**నందిగామ జూలై31,ప్రభాతవార్త :** సిఎం కెసిఆర్ రైతులకు అన్నివిధాల సంక్షేమ పథకాలతో ఆదుకుంటుందని,రైతుబీమా పథకానికి దరఖాస్తూ గడువు ఆగస్టు 1వ తేదీ వరకు ఉందని,రైతులు సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సంక్షేమ పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్ వెంటే జనం ఉన్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సిఫారసులు అవసరం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తుండటం గర్వకారణమన్నారు.రైతుబంధు,రైతుబీమా ,దళిత బంధు వంటి సంక్షేమ పథకాలు సద్వినియోగం చెసుకొని ప్రజలు,రైతులు ఆర్థికంగా ఎదగాలన్నారు.ఎనిమిదేళ్ల సిఎం పాలన ఓ సువర్ణాధ్యాయమని కితాబిచ్చారు.వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలతో,అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.అందరి బంధువుగా వెలుగొందుతున్న కెసిఆర్ గొప్ప దార్శనికుడని,దేశ అభివృద్ధి కోసం ఆయన దార్శనికత జాతీయ స్థాయిలో భారత జాతికి అవసరమన్నారు.దేశంలో నంబర్‌వన్ సిఎంగా కొనియాడబడుతున్న కెసిఆర్ నేతృత్వంలో టిఆర్‌ఎస్ మూడోసారి హాట్రిక్ విజయాన్ని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రంగారెడ్డి

**వైస్ చైర్మన్‌గా మల్కాపూర్ శ్రీకాంత్ ముదిరాజ్‌లు ఎన్నిక?**

**చేవెళ్ళ, జూలై 31, ప్రభాతవార్త :** చేవెళ్ల వ్యసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దామరిగిద్దకు చెందిన రంగారెడ్డి ఎన్నిక దాదాపు ఖాయమైంది. వైస్ చైర్మన్‌గా మాల్కాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ మదిరాజ్‌లను ఎంపిక చేయనున్నారు. ఈ నెల ఆఖరుతో ప్రస్తుత పాలక వర్గం పదవీ కాలం పూర్తి కానుండటంతో నూతనంగా చైర్మన్‌గా మిట్ట రంగారెడ్డి,వైస్ చైర్మన్‌గా శ్రీకాంత్ ముదిరాజ్‌లను ఎంపిక చేశారు. పార్టీ కోసం మిట్ట రంగారెడ్డి పనిచేయడంతో పదవి వరింటినట్లు తెలిసింది. మల్కాపూర్ చెందిన శ్రీకాంత్‌ముదిరాజ్ పార్టీ ఆవిర్భావం నుండి పనిచేచడంతో పాటు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్రను పోషించారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల డెరెక్టర్‌గా శ్రీకాంత్ ముదిరాజ్ పార్టీకి పటిష్టతకు ఎంతో గానో కృషి చేశాడని, యువతలో కూడ మంచిపట్టు ఉండటంతో వైస్ చైర్మన్ పదవి కట్టబెడుతున్నట్లు విశ్వాసనీయంగా తెలిసింది. త్వరలో చైర్మన్ రంగారెడి, వైస్ చైర్మన్ శ్రీకాంత్ ముదిరాజ్‌లను అధికారిరంగా ప్రకటించనున్నట్లు తెలిసింది.

# సబ్ స్టేషన్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యలు దూరం

## అందుగుల వాగుపై వంతెన నిర్మిస్తాం

### మంత్రి సబితాఇంద్రారెడ్డి

**మాడ్గుల జూలై 31,ప్రభాతవార్త :** సబ్ స్టేషన్ ఏర్పాటుతో రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా పోతాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు.ఆదివారం మాడ్గుల మండలంలోని అందుగుల గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు.అనంతరం రైతు వెదికను ప్రారంభించి మాట్లాడుతూ విద్యుత్ సబ్ స్టేషన్‌లతో విద్యుత్ సమస్యలు దూరమైతాయని మంత్రి అన్నారు.అందుగుల గ్రామస్తుల చిరకల కోరిక వాగుపై వంతెన నిర్మించాలని తొందరులోనే తిరుతుందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయన రైతు కాబట్టి రైతు సమస్య లు ఎప్పటికప్పుడు తీరుస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ప్రభుత్వాలలో వర్షం పడితే రైతు అప్పు కోసం ఎదురు చూసే వారు అని టిఆర్‌ఎస్ ప్రభుత్వంలో చినుకు పడిన వెంటనే రైతు ఖతంలో రైతు బంధు పడుతుందన్నారు.కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా రాష్ట్రాన్ని ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నం చేస్తుందన్నారు.టిఆర్‌ఎస్ ప్రభుత్వాని విమర్శంచే బిజెపి నాయకులు తమ రాష్ట్రలలో తెలంగాణ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...టిఆర్‌ఎస్ ప్రభుత్వంలో సిఎం కెసిఆర్ రైతులకు పెద్దపీట వేస్తుందన్నారు. ఎంపిపి పద్మారెడ్డి మాట్లాడుతూ...మాజీ ఎమ్మెల్యే చల్లా వంశిచంద్‌రెడ్డి కృషి వల్లనే సబ్ స్టేషన్‌లు ఏర్పాటు అయ్యాయని గతంలో భూసమస్యలు ఉండడం వల్లే అలస్యం అయిందని ఆమె గుర్తు చేశారు.అనంతరం బ్రహ్మణపల్లి, కలకొండ గ్రామంలో నూతనంగా మంజూరైన సబ్‌స్టేషన్ కార్యక్రమానికి ఎమ్మెల్సీలు కసిరె డ్డి,నారాయ ణరెడ్డి, సురభి వాణిరెడ్డి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిచైర్మన్ అనితాహరినాథ్ రెడ్డి,సర్పంచ్‌లు జయలక్ష్మి రాజు, జోజమ్మ, రవిందర్‌రెడ్డి, లక్ష్మియ్య, ఎంపిటిసిలు భరతి, జైపాల్‌రెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు రవితేజ, మాజీ ఎంపిపి జైపాల్ నాయక్, జంగయ్య పాల్గొన్నారు.



సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

### మాదిగ సహనాన్ని పరీక్షిస్తే బిజెపికి పుట్టగతులుండవ్

**రంగారెడ్డి జిల్లా కన్వీనర్ నరసింహా మాదిగ**

**షాద్‌నగర్, జూలై 31, (ప్రభాతవార్త) :** మాదిగల సహనాన్ని పరీక్షిస్తే బీజేపీ పార్టీకి పుట్టగతులు ఉండవని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ నరసింహా మాదిగ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు ఆదివారం ఏడో రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కొందుర్గు మండల ఎమ్మార్పీఎస్ ఇంఛార్జీ ఆనెగళ్ల ఆనంద్, ఎమ్మార్పీఎస్ మహిళలు నిరాహార దీక్షలు చేపట్టారు. మోకాళ్లపై కూర్చొని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసనలు వ్యక్తం చేశారు. ఈ దీక్ష శిభిరానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పెంటనోళ్ల నరసింహా మాదిగ హాజరై మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రస్తుత పార్లమెంట్ సమావేశల్లోనే చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాత్రికి రాత్రే నోట్లను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం, మాదిగలకు ఇచ్చిన మాటను ఎనిమిది సంవత్సరాలు గడిచిన ఎందు నిలబెట్టుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించి మాదిగలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కొందుర్గు మండల అధ్యక్షుడు అన్నెగాల్ల ఆనంద్, వెంకటయ్య, కర్రె బన్నీ, కళ్లపూరం యాదయ్య, జ్యోతి, స్వాతి, గంగోత్రి, రాజేశ్వరి, కీర్తి, అనిత తదితరులు పాల్గొన్నారు.

### రేషన్‌కార్డు దారులకు ఉచితంగా అదనంగా బియ్యం పంపిణీ

**ఆగస్టు 4 నుంచి పంపిణీకి చర్యలు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 31, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీ కొనసాగింపులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఉచిత బియ్యం అదనంగా పంపిణీకి ఆగస్టు నెలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఆహారభద్రతా కార్డుదారులకు ప్రతి ఒక్కరికి 15కిలోలు ఉచితంగా,అంత్యోదయ అన్న యోజన కార్డుదారులకు 35కిలోలతో పాటు అదనంగా 10కిలోల బియ్యం, అన్నపూర్ణ కార్డుదారులకు 10కిలోలతో పాటు అదనంగా మరో 10కిలోలు ప్రతి వ్యక్తికి ఆగస్టు-2022నెలకు సంబంధించి ఉచిత బియ్యం పంపిణీ చేయటానికి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వటంతో ఉత్తర్వులు జారీ చేసి చర్యలు తీసుకోవటం జరిగిందని మేడ్చల్ జిల్లా పౌరసరఫరాల అధికారి పేర్కొన్నారు. ఆగస్టు 4వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జిల్లాలోని అన్ని రేషన్‌షాపుల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేయటం జరుగుతుందని అన్నారు. రేషన్‌బియ్యం ఉచితంగ లబ్ది పొంది పంపిణీని కొనసాగించటానికి సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీని కొనసాగిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం కూడ ఉత్తర్వులు జారీ చేసి పంపిణీకి చర్యలు చేపట్టింది.

### నేటి నుంచి పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 31, ప్రభాతవార్త**

పదవతరగతి అడ్డాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి (ఆగస్టు 1నుంచి) ప్రారంభం అవుతున్నాయి. మేడ్చల్ జిల్లాలో 27పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదవతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు 6,061మంది హాజరు అవుతున్నట్లు మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.30గంటల మధ్యాహ్నం 12.45గంటల వరకు జరుగనున్నట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆమె వివరించారు. విద్యార్థుల హాల్‌టికెట్లు ఆయా పాఠశాలలకు పంపటం జరిగిందని, అందని వారు విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి పొందాలని ఆమె సూచించారు. పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందుగానే చేరుకోవాలని డిఇఓ సూచించారు.

### నేడు గోదారంగమన్నార్ స్వామి కళ్యాణోత్సవం

**-మంత్రి మల్లారెడ్డి దంపతుల రాక**

**ఘట్‌కేసర్, జూలై 31, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని శ్రీఅండాల్‌మన్నార్ నా యకస్వామి దేవస్థానంలో సోమవారం కళ్యాణోత్స వం జరుగనుంది. ఆలయంలో ఆదివారం అశ్వవాహనసేవ, గజవాహనసేవ నిర్వహించారు. భక్తుల గోవిందనామస్మరణ మధ్య ఉత్స వమూర్తులను గ్రామంలో పల్లకిలో ఊరేగించారు. సోమవారం గరుడవాహన సేవ, అండాల్ తిరునక్షత్రం, సాయంత్రం తిరు కళ్యాణం జరుగనుంది. సాయంత్రం 6గంటలకు ఆలయ ఆవరణలోని ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో అండాల్ అమ్మవారు, శ్రీరంగమన్నార్‌నాయకస్వామిల ఉత్స వ మూర్తులకు కళ్యాణం నిర్వహిస్తామని ధర్మకర్తలు తెలిపారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి దంపతులు విచ్చేస్తున్నారని ప్రజాప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. కళ్యాణం సందర్భంగా ధర్మకర్తలు ఆలయ పరిసరాల్లో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



అశ్వవాహనసేవ నిర్వహిస్తున్న ధర్మకర్తలు, భక్తులు

## రక్షిత కౌలుదారులకు వెంటనే పట్టాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

**సారంపల్లి మల్లారెడ్డి**

**యాచారం, జూలై 31 ప్రభాతవార్త :** తాటిపర్తి, కుర్మిద్ద సింగారం, నంది వనపర్తి గ్రామాలకు చెందిన రక్షిత కౌలుదారులు తరతరాల నుండి దేవాలయ భూములు సాగు చేస్తున్న వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని అఖిల భారత రైతు సంఘం ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాటిపర్తి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్షిత కౌలుదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంది వనపర్తి ఓంకారేశ్వరస్వామి దేవా లయం పేరు మీద 1400 ఎకరాల భూమి ఉందన్నారు. 1952 భూచట్టం రాక ముందు నుండి రైతులు ఈ భూ ములు సాగు చేసుకుంటున్నారని, 1950లో 37ఎ టెనెంట్ సర్టిఫికెట్ రైతు లకు ఇచ్చారన్నారు. భూస్వాములు రైతులను మోసం చేసి 38ఈ సర్టిఫికెట్ రైతులకు రాకుండా చేసి 1952లో దేవుని పేరు రాసి ఈ భూమి దేవునిదని చెబుతున్నారన్నారు. వాస్తవాలను పరిశీలిస్తే ఈ భూమి రైతులది అయినం దున తరతరాల నుండి ఇప ్పటి వరకు రైతులు ఈ భూమిని నమ్ముకుని సేద్యం చేస్తున్నారన్నారు. ఇందులో బావులు, బోర్లు తవ్వినారు, కరెంట్ మం జూరైందని, ఈ భూముల్లో రాళ్లు, రప్పలను తొలగించి అభివృద్ధి చేసి సాగు చేసుకుంటారన్నారు. కావాలనే కొందరు రైతులను భూమి నుండి వెళ్లగొట్టడం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ ప్రయ త్నాలను విరమించుకుని రైతులకే పట్టాలు ఇవ్వాలని, రైతులకు మోసం చేస్తే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు చేస్తామన్నారు. ఇదే భూమిలో సర్వే నెంబర్ 211, 201, 204లలో 380 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదని అధికారులు గుర్తించారన్నారు.దీనిని ఫార్మాసిటీకి ఇవ్వాలని ప్రజాప్రతినిధు లు తీవ్ర ప్రయత్నం చేసు_న్నారు. ఈ ప్రయత్నాలు మానుకుని సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి, వ్యకాస జిల్లా కార్యదర్శి కె.జగన్, సిపిఎం మండల కార్యదర్శి ఏ.నర్సింహ, వ్యకాస జిల్లా అధ్య క్షుడు అంజయ్య, తాటిపర్తి సర్పంచ్ దూస రమేష్, జె.రాములు, ఉపస ర్పంచ్ నర్సింహ, సంజీవ, కృష్ణ, బుగ్గరాములు, రాములు, రైతులుపాల్గొన్నారు.

### నామమాత్రపు కేసులు కాదు.. నిందితులను కఠినంగా శిక్షించాలి

**- డిమాండ్ చేస్తున్న దళిత ప్రజాసంఘాల నాయకులు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

**షాద్‌నగర్, జూలై 31, (ప్రభాతవార్త) :** దళిత వర్గానికి చెందిన యువకులపై దాడి జరిగితే నామమాత్రపు కేసులు పెట్టడం సబబు కాదని, నిందితులను కఠినంగా శిక్షించే విధంగా కేసులు పెట్టాలని దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని దేవిగ్రాండ్ హోటల్ సమావేశ హాల్‌లో ప్రజా సంఘాల నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు దళిత ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ... చెవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన దళిత నాయకుడు భార్గవ్ రామ్‌ను, రాజు మహేందర్‌లపై అదే గ్రామానికి చెందిన కొంత మంది ముస్లింలు హైదరాబాద్ ముస్లిం రౌడీలను పిలపించి పథకం ప్రకారం గత నెల 28న దళిత యువకులపై విచక్షణారహితంగా దాడి చేశారని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఇంటి ఆవరణలో ఊరికి సంబంధించిన బాట విషయంలో దళిత యువకులు ముస్లింలను బాట గురించి అడగడంతో వారు హైదరాబాద్ నుంచి రౌడీలను పిలిపించి విచక్షణ రహితంగా కొట్టారని ప్రజా సంఘాల వారు పేర్కొన్నారు. ఈ విషయమై బాధితులు షాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని కేవలం కులం పేరుతో దూషించినట్లు నామమాత్రపు కేసు పెట్టి దాడి చేసి గాయపరిచిన విషయాన్ని పక్క తోవ పట్టించి కేసును నీరుగారిచే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. దీంతో దళిత ప్రజా సంఘాల పోరాటం ద్వార ఏసీపీ దిగివచ్చి పంచనామా నిర్వహించారని, అయిన ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులు ఉద్దేశపూర్వకంగానే దాడి జరిపారని, చిన్న విషయాలకు కూడా దాడి చేయడం హేయమైన చర్య అని వారు మండి పడ్డారు. దళితులపై దాడులు జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటారా అని వారు ప్రశ్నించారు. ఇకనైనా ఉన్నత స్థాయి అధికారులు సమగ్ర విచారణ జరిగించి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు జంగయ్య, తుప్పుడు నర్సయ్య, మల్లేష్‌గౌతమ్, ఆవుల పెంటయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రారంభమైన మొహర్రం ఉత్సవాలు

**కొడంగల్ రూరల్, జూలై, 31 (ప్రభాతవార్త):** హిందు, ముస్లిం సోదరులు సోదరభావంతో జరు పుకునే మొహర్రం ఉత్స వాలు ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు జరుపుకునే మొహర్రం ఉత్స వాల్లో భాగంగా కొడంగల్ పట్టణంలోని జామే మస్జిద్ దగ్గర గల అల్‌సాబ్ పీర్ల మసీదుతో పాటు ఇమాం ఖాసీం, అలీఅబ్బాస్, ఖూని అలావ్, అలావ్ హుసేన్, అలీ అస్గర్, బారా ఇమాం, హుసేన్, హుసేన్ పీర్ల మసీదుల్లో పీర్లను ప్రతిష్టించారు.ఉత్స వ కమిటీ నిర్వాహకులు అబ్దుల్ లతీఫ్, ఎంఐఎం కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ ఆదివారం విలేక రులతో మాట్లాడుతూ మొహర్రం ఉత్స వాలు నిర్వాహకులు ఖాతీబ్ ముజిబుర్ రహెమాన్ ఆధ్వ ర్యంలో పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో జరిగే మొహర్రం ఉత్స వాలకు భీమండి, కర్నాటక రాష్ట్రం బీదర్, మహారాష్ట్ర, అహ్మదాబాద్, షోలాపూర్, పూణే తదితర ప్రాంతాల నుంచి ప్రజలు తరలి రావడం జరుగుతుందన్నారు. కులమతాలకతీతంగా జరుపుకునే మొహర్రం ఉత్స వాలను హిందు, ముస్లిం సోదరులు ఐక్యమత్యంతో శాంతియుతంగా జరుపు కోవాలని వారు పిలుపునిచ్చారు. పది రోజుల పాటు మసీదుల్లో ప్రతిష్టించిన పీర్లకు భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ అలైబలై ఆడుతూ జరుపుకుంటారన్నారు.



ప్రతిష్టించిన పీర్లు

# నిండుకుండలా శామీర్‌పేట పెద్దచెరువు



నీటితో నిండిన శామీర్‌పేట పెద్దచెరువు

## చెరువును పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలం

**శామీర్‌పేట, జులై 31, ప్రభాతవార్త**

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో శామీర్‌పేట పెద్ద చెరువులోకి కొత్త నీరు భారీ ఎత్తున చేరటంతో నిండు కుండలా దర్శనం ఇస్తుంది. మరో మూడు అడుగుల నీరు వస్తే ఇక ఈ చెరువు నిండి అలుగులు పారనుంది. ఇప్పటికే చెరువు నిండు కుండలా మారి అందరిని ఆకట్టుకుంటుంది. చెరువు వద్ద వాతవరణం కూడ ఆహ్లాదకరంగ మారి ఆకర్షణీయంగ మారింది. శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకోవటానికి, చెరువు చూడటానికి నగరంలోని పలు ప్రాంతాల వారితో పాటు పరిసర వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న విహారయాత్రీకుల, భక్తుల రాక కూడ పెరిగింది. మేడ్చల్ జిల్లాలోనూ శామీర్‌పేట అతి పెద్ద చెరువుగా గుర్తింపులో ఉంది. శామీర్‌పేట పెద్ద చెరువు గత ఏడాది వర్షాకాలంలో నిండిన సంగతి తెలిసిందే. ఆ తరువాత ఈ పెద్ద చెరువు నుంచి పంట పొలాలకు చెరువు నుంచి నీటిని ఇరిగేషన్ అధికారులు రైతుల కోరిక మేరకు వదలటం జరిగింది. ఈ పెద్ద చెరువు నీటి మట్టం పరిమాణం మొత్తం 33అడుగులు కాగా గత నెల రోజుల కిందట 22 అడుగుల నీరు కల్గి ఉంది. ఇటీవల గత ఇరవై రోజుల నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేకుండ కురుస్తున్న వర్షాలతోనూ, కొన్ని సార్లు కురిసిన భారీ వర్షాలతోనూ ఈ చెరువులోకి కొత్తగా 8అడుగుల కొత్త నీరు వర్షాలతో చేరింది. ప్రస్తుతం నీటి మట్టం 30అడుగులకు చేరుకుంది. ఇక మరో 3అడుగుల నీరు వస్తే చెరువు నిండి అలుగులు నీరు పారనుంది. ప్రధానంగ భారీ వర్షాలతో పాటు మేడ్చల్ పెద్ద చెరువు నిండి అలుగులు పారటంతో ఆ నీరు కూడ శామీర్‌పేట పెద్ద చెరువులోకి కొత్త నీరు చేరటం కూడ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక కేంద్రంగ చేస్తామని చెప్పి కంటి తుడుపు చర్యగా కొంత వరకు గార్డెన్ మాత్రం చేసి వదిలేసింది. గత కొన్నేళ్ల కిందట ఈ చెరువు నిండి, గత ఏడాది కురిసిన వర్షాలతో ఈ పెద్ద చెరువు నిండటం జరిగింది. ఈ చెరువు గత ఏడాది నిండటం, మళ్లీ ఈ ఏడాది కూడ చెరువు నిండటానికి చివరి దశకు చేరుకోవటం రైతాం గం, ఈ ప్రాంత ప్రజల్లోనూ హర్షం వ్యక్తం అవుతుంది. ఈ పెద్ద చెరువు నిండితే పెద్దగా రైతాంగానికి అండగా ఉంటుంది. బోర్లలో నీటి మట్టం పెరగటంతో పాటు సాగునీటికి కొదవ అనేది ఉండదని చెప్పవచ్చు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తరువాత టిఆర్‌ఎస్ ప్రభుత్వం పలు సార్లు శామీర్‌పేట పెద్ద చెరువును గోదావరి జలాలతో నింపుతామని అనటం తప్ప గత ఎనిమిది ఏళ్ల నుంచి ఎలాంటి కదలికలు లేవని చెప్పవచ్చు. అయితే ప్రకృతి రీత్య గత ఏడాది భారీ వర్షాలు కురవటంతో ఈ పెద్ద చెరువు నిండింది. అదే విధంగ ఈ సారి కూడ వర్షాకాలం ఆరంభంలోనే భారీ వర్షాలు కురవటంతో ఈ పెద్ద చెరువులో నీటిమట్టం పెరిగింది. మరో రెండూ, మూడు భారీ వర్షాలు కురిస్తే ఇక ఈ చెరువు నిండి రెండు సంవత్సరాలలో రెండు సార్లు నిండటం చారిత్రాత్మకం కానుంది. మరో రెండు నెలల పాటు వర్షాకాలం ఉండే అవకాశం ఉన్నందున ఈ సారి కూడ పెద్ద చెరువు నిండటం ఖాయమని స్పష్టంగ చెప్పవచ్చు. శామీర్‌పేట పెద్ద చెరువు రాజీవ్‌రహదారికి పక్కనే (హైదరాబాద్-కరీంనగర్ రోడ్డు పక్కనే) ఉండటంతో పలు జిల్లాల వారికి ఈ చెరువు నిండుకుండలా మారి అందరిని ఆకట్టుకుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా శామీర్‌పేట పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే విహార యాత్రీకులకు, ఈ ప్రాంత ప్రజలకు సౌకర్యం కలుగనుంది. గతంలో సుమారు 25కోట్ల రూపాయలు శామీర్‌పేట పెద్ద చెరువు పర్యాటక కేంద్రంగ అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు సిఎం కెసిఆర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే దీనిలో సుమారు 3కోట్ల రూపాయలతో కొన్ని పనులు చెరువు కట్ట భాగానా గార్డెన్స్, కొన్ని విశ్రాంతి కుటీరాలు ఏర్పాటు నిర్మించటం,చెరువు ప్రాంగణం లో బంగారు తెలంగాణ బోర్డు పెట్టటం జరిగినట్లు సమాచారం.మరీ వీటిలో కూడ ఎన్ని నిధులు విడుదల చేసి ఎన్ని పనులు చేశారు. ఎన్ని నిధులు ఖర్చు చేసిన విషయాలు అధికార వర్గాల నుంచి తెలియాల్సి ఉంది.

చెరువు నీటిని సాగునీటికి సంబంధించి ఇరిగేషన్ అధికారులు ఈ పెద్ద చెరువును చూస్తున్నారు. చెరువుకట్ట అభివృ ద్దిని మాత్రం శామీర్‌పేట పెద్ద చెరువు శ్రీకట్టమైసమ్మ అభివృద్ధి కమి టీ వారు భక్తులకు ఏర్పాట్లు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యా టక కేంద్రంగా గుర్తించి వసతులు, సౌకర్యాలు పిల్లల పార్కులు, నల్లాలు ఏర్పాటు, ఫౌంటెన్స్, గార్డెన్స్, పలు ఆకర్షణీయ మైన పరికరాలతో నల్లాలు ఏర్పాట్లు, అలంకరణలతో విద్యుత్ దీపాలు కూడ ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రా యపడు తున్నారు.

# ఎమ్మార్పీకంటే ఎక్కువగా వసూళ్లు

**అధిక ధరలతో దోచుకుంటున్న థియేటర్లు**

**పుడ్‌కోర్టుల్లో వారిదే ఇష్టారాజ్యం**

**మళ్లీ దోపిడీ మొదలైంది**



**నామమాత్రపు దాడులతోనే సరిపెడుతున్న అధికారులు**

హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త: సెలవురోజుల్లో, తీరిక సమయాల్లో, స్నేహితులతో గానీ,కుటుంబసభ్యులతో గానీ వినోదం కోసం కాసేపు సినిమా చూద్దామని థియేటర్‌కు వెళ్ళేవారికి లోపల తినుబండారాల ధరలు చూస్తే ప్రేక్షకుడి అహ్లాదం,ఆనందాన్ని ఆవిరిచేస్తున్నాయి.కనీస వసతుల ఏర్పాటు చేయకపోగ అధిక ధరలతో సినీప్రేక్షకుడు విలవిలలాడుతున్నాడు.నగరంలోని థియేటర్‌ల పరిస్థితి అధ్వానంగా మారింది. పట్టించుకునే వారు లేకపోవడంతో థియేటర్ యజమానులు ఇష్టారాజ్యంగా తినుబండారాలను ఎమా ర్పీ ధరల కంటే అధికంగా వసూలు చేస్తూ కొన్ని తినుబండారాలకు ధరలను కూడా వారే నిర్ణయించుకుంటున్నారు. గతరెండుమూడేళ్లుగా ఎంఆర్‌పిరేట్లను కఠినంగా అమలు చేసిన అధికారులు ఇటీవల పట్టించుకోకపోవడంతో థియేటర్ యజమానులు మళ్ళీ దోపిడీని ప్రారంభించారు. నగరంలో సుమారు 120కిపైగా థియేటర్లు మల్టీప్లెక్స్‌లు ఉన్నాయి. సినిమా చూస్తున్నంత సేపు ఎంతో సంతోషంగా ఉన్న ప్రేక్షకులకు విరామ సమయంలో తినిబండారాల ధరలు చూస్తే ముచ్చెమటలు పడుతున్నాయి. విరామ సమయంలో కుటుంబసభ్యులకు ఏదైనా తినిపిద్దామనుకుంటే ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. బయట ఉన్న ధరలతో పోలిస్తే థియేటర్ల లోపల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. టికెట్టు ధర కంటే తినుబంవడారాల ధరలు అధికంగా ఉండటం ప్రేక్షకుడు జీర్ణించుకోలేకపోతున్నారు. కొత్తపేటకు చెందిన ఓప్రైవేట్ ఉద్యోగి భార్య,ఇద్దరు పిల్లలతో కలిసి దిల్‌షుక్‌నగర్‌లోని ఓసినిమా థియేటర్‌కు సినిమాకు వెళ్లాడు.సినిమా విరామ సయంలో పిల్లలకు కూల్‌డ్రింక్ తెద్దామని పుడ్‌కోర్ట్‌కు వచ్చాడు. పావుకిలో బరువుకూడా లేని పాక్‌కార్న్ ధర రూ.80 చెప్పడంతో నివ్వెరపోయాడు.అంతేకాకుండా అరలీటర్ వాటర్ బాటిల్‌కు 30,రెండు సమేసాలకు 50 అని చెప్పడంతో ఆశ్చర్యానికి గురయ్యాడు. ఇదేంటని ప్రశ్నిస్తే గొడవవుతుందేమోనని వెనక్కితగ్గి వారు అడిగినంత ఇచ్చి కొనుగోలు చేసి వచ్చి సీట్లో కూర్చున్నాడు. బయటికి వచ్చాక 10రూలకు దొరికే పాక్‌కార్న్ ధర 80 ఏంటని.. ఇరానీ హోటళ్లలో 10రూలకు దొరికే సమోసాలు రెండింటికి యాభై రూపాయలా అంటూ అసహనం వ్యక్తం చేస్తూ వెళ్ళిపోయాడు. కేవలం ఇక్కడే కాకుండా నగరంలోని చాలా థియేటర్లలో ఇదే పరిస్థితి నెలకొంది.పుడ్‌కోర్టుల్లో థియేటర్ యాజమాన్యాలే ధరలు నిర్ణయిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు.

**అంతా మా ఇష్టం..** ఏదైనా వస్తువు కానీ తినుబండారాలు కానీ తయారు చేసి వాటిని విక్రయించేందుకు ఎమ్మార్పీని నిర్ణయిస్తారు. ఆవస్తువు నాణ్యత, ముడి పదార్థాల విలువకు కొంతమేర లాభాన్ని జోడించి ఎమ్మార్పీని నిర్ణయిస్తారు. అయితే సినిమా థియేటర్లలో నిర్ణయించే తీరు మాత్రం ఎవరికీ అంతుబట్టడం లేదు.ఉదాహరణకు ఆలుగడ్డ మైదాపిండి తదితర వస్తువులతో తయారు చేసిన సమేసాను సుమారు రూ.10నుండి 15 ఖర్చుతో తయారు చేస్తుంటారు.ఈసమోసాలను ఏకంగా రూ.50కి అమ్మడం ఎంతవరకు సమంజసం అని సాధారణ ప్రేక్షకులు ప్రశ్నిస్తున్నారు.

**నామమాత్రపు దాడులు..**

ప్రేక్షకులను నిలువునా దోపిడీ చేస్తున్నా.. నిలువరించే అధికారం తమకు లేదని తూనికలు కొలతల శాఖ చేతులత్తేస్తుంది. అడ్డగోలుగా రేట్లను నిర్ణయించి అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకునే తూనికలు కొలతలశాఖ అధికారులు మాత్రం చిత్రంగా చూస్తున్నారు. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయించినప్పుడు, లేదా కొలతల్లో వ్యత్యాసం ఉంటేనే తాము దాడులు చేయగలమని వారు అంటున్నారు. అప్పుడప్పుడు దాడులు నిర్వహించి జరిమానాలు విధించడం, నోటీసులు జారీ చేయడం తప్ప గట్టిచర్యలు తీసుకునే అధికారం తమకు లేదని తెలుపుతున్నారు.

# ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : మంత్రి మల్లారెడ్డి

కంటోన్మెంట్, జూలై 31, ప్రభాతవార్త : తెలంగాణ ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలని దండుమారెమ్మ అమ్మవారిని వేడుకున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సి.హెచ్.మల్లా రెడ్డి తెలిపారు. కంటోన్మెంట్ 3వ వార్డు బాలం రాయిలో ప్రసిద్ధిగాంచిన దండుమారెమ్మ దేవాలయంలో ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాలకు మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్, కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు జె.రామక్రిష్ణ, కంటోన్మెంట్ బోర్డు డిప్యూటీ సిఈఓ విజయ్ కుమార్ బాలన్ నాయర్, మల్కాజిగిరి పార్లమెంట్ టిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు, జక్కుల మహేశ్వర్‌రెడ్డి,జంపనప్రతాప్, ఎస్.జి.ఎఫ్.అధినేత శ్రీగణేష్, బిజెపి అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్, సామాజిక కార్యకర్త అరిగె మధుసూదన్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతిథులను ఆలయ ఈఓ సురేందర్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ ముప్పిడిగోపాల్, మాజీ బోర్డు సభ్యుడు ప్రభాకర్‌లు శాలువ కప్పి సత్కరించారు. అదే విధంగా రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్‌లు బంగారు బోనం ఎత్తుకొని దండుమారెమ్మ అమ్మవారికి సమర్పించారు.





## ఉదయం ఉక్కపోత.. రాత్రి వర్షం

హైదరాబాద్, జూలై 31,ప్రభాతవార్త: నగరంలో ఆదివారం ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో ఎండ దంచికొట్టింది. దీంతో నగరవాసులు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. కానీ రాత్రి సమయానికి నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురియడంతో.. ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగింది. ఖైరతాబాద్, పంజాగుట్ట, లక్డీకపూల్, బంజారాహిల్స్, మణికొండ, ఖాజాగూడ, షేక్‌పేట్, టోలీచౌకి, జూబ్లీ హిల్స్, కూకట్‌పల్లి, మూసాపేట్, అమీర్‌పేట్, సనత్‌నగర్, బాలానగర్, రాజేంద్రనగర్, కిస్మత్‌పురా, బండ్లగూడ జాగీర్, గండిపేట్, పుప్పాలగూడ, అత్తాపూర్‌తో పాటు పలుప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షాల నేపథ్యంలో జిహెచ్‌ఎంసి అధికారులు, డిఆర్‌ఎఫ్ బృందాలు అప్రమత్తమయ్యారు.

## డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించండి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్**



**కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్**

చార్మినార్, జూలై 31 ప్రభాతవార్త : వర్షాకాలంలో విజృంభించే డెంగ్యూతో పాటు అంటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ అన్నారు.అంటు వ్యాధులపై నిర్వహించనున్న ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా దోమ కాటు వ్యాధుల నివారణకు ప్రతీ ఆదివారం ఉదయం 10 గంటల 10 నిమిషాలు, 10 వారాలు అనే ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార సామాగ్రి, కరపత్రాలు, షార్ట్ ఫిల్మ్‌లను ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ ఆదేశాలు మేరకు ప్రజలకు దోమ కాటుతో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రజలకు వ్యాధుల నివారణపై వివరించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మలేరియా,డెంగ్యూ, మెదడు వాపు, బోదకాలు ఇతరత్రా జ్వరాలు ప్రబల కుండా ముందు తీసుకోవాలిసిన జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాలు గురించి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ నామా సామ్రాట్ అశోక్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ జోన్ చీఫ్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# భారీగా లిక్కర్ సేల్స్



**బోనాలకు రూ. 70 నుండి 80 కోట్ల మేర విక్రయాలు**

**సర్కారు ఖజానాకు భారీగా ఆదాయం**

హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త: బోనాలతో గ్రేటర్ హైదరాబాద్‌లో భారీగా లిక్కర్ సేల్స్ జరిగాయి. నూతన సంవత్సర వేడుకల తర్వాత తిరిగి ఆ స్థాయిలో విక్రయాలు జరిగినట్లు మధ్యం వ్యాపారస్తులు తెలియజేశారు. బోనాల పండుగ అంటేనే కుటుంబ సభ్యులందరినీ ఇంటికి పిలుచుకుని పిల్లాపాపలతో పండుగను ఘనంగా చేసుకోవడం ఆనవాయితీ. అందులోనూ బోనాలు అంటే ఆ పండుగ ప్రత్యేకతనే వేరు. ఇంటి అల్లుళ్లు బావలు బావమరుదులు ఇంకా బంధు మిత్రులు ఇలా అందరూ కలిసి పండుగను అందులోనూ మద్యం తో జోష్ చేసుకుంటూ గడపడం తెలంగాణ ప్రత్యేకతగా చెప్పవచ్చు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగానూ బోనాల పండుగ అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. శనివారం తో ఆషాఢ మాసం ముగిసి ఆదివారం నుండి శ్రావణ మాసం ప్రారంభం అయింది. అయితే మందు బాబులు కొందరు శ్రావణంలో కొంత మద్యానికి దూరంగా ఉండే వారూ ఉంటారు ఇలాంటి వారంతా ఆషాఢ బోనాలకే మద్యంను ఇష్టంగా పుచ్చుకుంటారు. ఈ కారణంగా భారీగానే మద్యం విక్రయాలు నమోదు చేసుకున్నాయి. సాధారణంగా ఇలాంటి విక్రయాలు ఎప్పుడో ఏడాది ముగిసే సమయంలో కొత్త సంవత్సర వేడుకల సందర్భంలోనూ జరగుతుంటాయి. ఉదాహరణకు గత ఏడాడి 2021 డిసెంబర్ 31 న గ్రేటర్ హైదరాబాద్ పరిధి వరకే సుమారు వంద కోట్ల రూపాయల వరకు విక్రయాలు జరిగాయి. డిసెంబర్ 30 ,31 తేదీలలోనే రూ. 215 కోట్ల విక్రయాలు జరిగాయి. రోజువారిగా చూసుకుంటే సుమారుగా 70 నుండి 80 కోట్ల వరకు విక్రయాలు జరిగాయి. తాజాగా ఈ సారి ఆశాఢమాసం బోనాలకు నెల రోజుల పాటు అంతే మొత్తంలో విక్రయాలు జరిగినట్లు మద్యం గతంలో ఎన్నడూలేనంత పెద్ద ఎత్తున విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

**కరోనాతో కాస్త దూరంగా..** గత రెండేళ్లుగా ఒక వైపు కరోనా.. మరో వైపు లాక్ డౌన్ లాంటివి ఉండడంతో మందుబాబుల దగ్గర డబ్బులకు కటకటగా ఉండింది. ఈ కారణంగా విక్రయాలు సాగక వైన్ షాప్ ఓనర్లు చతికిల పడ్డారు. తాము ఎంతో ఆసించి కోట్ల మొత్తాలను చెల్లించి టెండర్లలో దుకాణాలను దక్కించుకున్నప్పటికీ చివరికి తీవ్రంగా నష్టాలనే చవి చూశామని ఆ దెబ్బతో మళ్లీ వైన్స్ దుకాణాల టెండర్ల జోలికి వెళ్లాలంటేనే జంకుతున్నా మని చెబుతున్నారు. అయితే ఇది గతం అని ప్రస్తుతం మాత్రం ఆశించిన స్థాయిలోనే మద్యం వ్యాపారాలు సాగుతున్నాయని మద్యం వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడాది న్యూ ఇయర్ వేడుకల సందర్భంలోనూ గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రూ. 50 కోట్ల మేరకు అదనపు విక్రయాలే జరిగాయని చెబుతున్నారు. బోనాల సీజన్ లోనూ గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రికార్డు స్థాయిలోనే లిక్కర్ విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్క 2021 డిసెంబర్ 31 నాడే గ్రేటర్ హైదరాబాద్‌లో రూ. 51 కోట్లు నమోదు కాగా రాష్ట్రం మొత్తంగా రూ. 171 కోట్ల లిక్కర్ విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు. ఇక బోనాల పండుగకు భారీగా లిక్కర్ విక్రయాలు నమోదు చేసుకున్నాయి. గత నెల రోజుల గణాంకాలను తీసుకుంటే రంగారెడ్డి జిల్లాలో రూ. 6970 కోట్లు , మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రూ. 3288 కోట్లు , హైదరాబాద్‌లో రూ. 3201 కోట్ల అమ్మకాలు జరిగాయి. ఈ బోనాలకు రూ. 4.36 లక్షల కోట్ల లిక్కర్ అమ్మడు పోగా 5. 32 లక్షల కోట్ల బీర్లను మందు బాబులు స్వాహా చేసేశారు. పండుగ అంటే మద్యం పుచ్చుకోవడమే కాదు అందరితోనూ కలిసి పోవడమే అని మందు బాబులు చెబుతున్నారు. అది కొత్త సంవత్సర వేడుక అయినా బోనాల పండుగ అయినా మందు బాబులకు మద్యం కిక్కు తప్పసరి అవుతుండడం గమనార్హం.

**అప్పుడలా ఇప్పుడు ఇలా..** డిసెంబర్‌లోనే రాష్ట్ర వ్యాప్తంగా చూసుకుంటే రూ. 3,435 కోట్ల మద్యం విక్రయాలు జరగ్గా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఇందులో దాదాపుగా సగం వరకు అంటే రూ. 1,550 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరిగాయి. కాగా రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా ఈ బోనాల్ సీజన్‌లోనే మద్యం ధరలను స్వల్పంగా పెంచేసింది. అయితే అప్పటికే తయారైన మద్యం బాటిళ్లపై అదనపు వడ్డనకు సంబంధించిన సమాచారం లేక పోవడంతో మందుబాబులు గగ్గొలు పెట్టారు. అధిక ధరలకు ఎలా విక్రయిస్తారంటూ వ్యాపారస్తులపై మండిపడ్డారు. దీనిని గమనించిన వైన్స్ షాప్ వ్యాపారులు కేవలం రాతపూర్వకంగానే ఒక బోర్డు వేసి అధిక ధరల విషయాన్ని అందులో ప్రస్తావించారు. ప్రభుత్వం మద్యం పెంపుదలకు సంబంధించిన సర్కులర్‌ను ఒక జిరాక్స్ తీసి షాపు ముందు అంటించి పెట్టడం కూడా కాస్త వివాదాలకు దారి తీసింది. సర్కారు నడుస్తున్నది తమ ఆదాయంపైనేనని అలాంటప్పుడు మద్యం ధరలను మద్యంలోనే ఎలా పెంచుతుందని కొందరు వాదనలకు దిగారు . ఏతా వాతా మొత్తంగా తమకు ఇలాంటి తలనొప్పులు ఎదుర్కొక తప్పలేదని వైన్స్ షాప్ వ్యాపారులు చెబుతున్నారు. ఏతా వాతా ఈ మొత్తంలో సింహ భాగం రాష్ట్ర ఖజానాకే వెళ్లుండడం విశేషం.

## భారతీయ శాస్త్రీయ కళలు ఉన్నతమైనవి

**హార్యాన గవర్నరు బండారు దత్తాత్రేయ**



**సత్కారం పొందిన విద్యార్థులతో బండారు దత్తాత్రేయ, వనజ ఉదయ్**

నాంపల్లి, జూలై 31 ప్రభాతవార్త : భారతీయ శాస్త్రీయ కళలు మన సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నం మరెంతో సమున్నతమైనవన్న హర్యాన రాష్ట్ర గవర్నరు బండారు దత్తాత్రేయ ఈరోజు చండీగఢ్ హరియాణా రాజ్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ నాట్యవిభాగం అధిపతి, కూచిపూడి నాట్య విద్వాంసురాలు డా. వనజ ఉదయ్ నేతృత్వంలో పలువురు విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి, ఆంధ్రనాట్యం; నాట్యాచార్యుడు కళాకృష్ణ నృత్యదర్శకత్వంలో పేరిణి శివతాండవం నృత్యాలను ఎంతో ఉత్సాహంతో వీక్షించి వారి నాట్య ప్రావీణ్యాన్ని ప్రశంసించి ఘనంగా సత్కరించి, నాట్య గురువులను, విద్యార్థులకు అత్యుత్తమ నటశిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తున్నందుకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావును బండారు దత్తాత్రేయ అభినందించారు.

## అంగరంగవైభవంగా 'రసోల్లాస్' జాతీయ నృత్యోత్సవం



నాంపల్లి, జూలై 31 ప్రభాతవార్త : శ్రీ సాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ప్రఖ్యాత నాట్యగురువు డా. రమాదేవి ప్రతీయేటా అన్ని కళాప్రక్రియల నుండి ఎంతోమంది యువ, ప్రఖ్యాత కళాకారులను ఎంపికచేసి వారికి వేదికనందించి కళాసేవగా నృత్యోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ వస్తున్న విషయం పాఠకులకు, నాట్యకళాప్రియులు, కళాప్రేమికులకు విదితమే. కరోనా కరాళనృత్యం కారణంగా మూడు సంవత్సరాల అవాతరం అనంతరం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఈరోజు రాత్రి 'రసోల్లాస్' పేరుతో జాతీయ నృత్యోత్స వాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భిలాయి నుండి మృణ్మయి భరతనాట్యం, రమాదేవి శిష్యురాలు అక్షర కూచిపూడి నృత్యాన్ని, కేరళకు చెందిన కార్తీక దేవదాస్ మోహినియాట్టం, అమెరికాకు చెందిన సిద్ధ్య అరకెపూడి కూచిపూడి నాట్యప్రదర్శనలు ఎంతో జనరంజకంగా హృద్యం కావించి విచ్చేసిన అశేష ఔత్సాహిక కళా నాట్యప్రియులను సమ్మోహితుల్నిచేసి హర్షధ్వానాల మధ్య ప్రశంసాపూర్వక శుభాభినందనలు పొందారు.

## బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానంలో శ్రావణమాసం విశేష పూజలు



**విశేష పూజల్లో పాల్గొన్న మహిళలు**

ఎస్ఆర్‌నగర్, జూలై 31 ప్రభాతవార్త : బల్కంపేట శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో శ్రావణమాసం సందర్భంగా శ్రీ ఎల్లమ్మ అమ్మవారికి విశేష పూజలలో భాగంగా ఆదివారం దేవస్థానం నందు 108 కేజీల పసుపు, 108 కేజీల కుంకుమ వివిధ రంగుల చీరలతో 150మంది మహిళా భక్తులతో వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి పసుపు, కుంకుమ వివిధ రంగుల చీరలు సమర్పించడం జరి గిందని సహాయ కమీషనర్, కార్యనిర్వహ ణాధికారిని ఎస్.అన్నపూర్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సతీమణి తసాని సువర్ణ పాల్గొని అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, అమీర్‌పేట దేవస్థానం డివిజన్, దేవస్థాన ఫౌండర్ ట్రస్టీ కె.సాయిబాబాగౌడ్, దేవస్థాన మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు పి.అశోక్‌యాదవ్, ఎం.హనుమంతరావు, బి.ఆర్.నారాయణ రాజు, కొలను భూపాల్‌రెడ్డి, లక్ష్మీ, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు కూతురు నరసింహా పాల్గొన్నారు.

## నేషనల్ బహుజన ఫ్రంట్ ఆవిర్భావం

సైఫాబాద్, జులై 31 ప్రభాతవార్త: బహుజన దృక్పథం కలిగిన రాజ్యాధికార పార్టీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ, లోక్‌జనశక్తి పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, తెలంగాణ లోక్‌సత్తా పార్టీల నాయకులు ఆదివారం సూర్యలోక్ కాంప్లెక్స్‌లో సమావేశమై 'నేషనల్ బహుజన ఫ్రంట్'గా ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా ఫ్రంట్ నాయకులు విజిఆర్ నారగోని, సిహెచ్ బాలకృష్ణ, మహేష్‌బాబు, శ్రీధర్ తదితరులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాలలో తమ ఫ్రంట్ అన్ని స్థానాలలో పోటీ చేస్తుందని చెప్పారు. ఏపిలోని 175 అసెంబ్లీ స్థానాలకు, 25 లోక్‌సభ స్థానాలకు, తెలంగాణలోని 119 అసెంబ్లీ స్థానాలకు, 17 లోక్‌సభ స్థానాలకు పోటీ చేయాలని తీర్మానం చేసినట్లు వారు తెలిపారు.

## స్విమ్మింగ్‌పూల్‌లో పడి బాలుడి దుర్మరణం

**బంధువుల గృహ ప్రవేశానికి వచ్చి మృతిచెందిన బాలుడు**



**కోకాపేట్‌లోని ఓ అపార్టుమెంట్‌లో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో పడి దుర్మరణం చెందిన శ్యామ్ (పాతచిత్రం)**

నార్సింగి, జూలై 31 ప్రభాతవార్త : బంధువుల గృహ ప్రవేశానికి వచ్చిన ఓ బాలుడు స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి దుర్మరణం చెందాడు. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ రాష్ట్రం విజయవాడ ప్రాంతానికి చెందిన పద్మారాణి, విజయ్‌కుమార్‌లు తమ కుమారుడు శ్యామ్(14)తో కలిసి రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేట్ గ్రామంలో ఉంటున్న తమ బంధువుల గృహ ప్రవేశానికి రెండు రోజుల క్రితం వచ్చారు. అపార్టుమెంట్‌లో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో బాలుడు ఆడుకుంటూ నీట మునిగిపోయాడు. ఆ సమయంలో బాలుడిని ఎవరూ గమనించలేదు. దీంతో నీట మునిగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇంట్లో తమ కుమారుడు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పరిసర ప్రాంతాలలో వెతుకుతుండగా స్విమ్మింగ్‌ఫూల్‌లో నీట మునిగి కనిపించాడు. వెంటనే ఆ బాలుడిని వెలికి తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. బాలుడు స్విమ్మింగ్‌ఫూల్‌లో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడా? లేక ఎవరైనా బాలుడిని తోసేశారా? అన్న కోణంలో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి**

ఎస్ఆర్‌నగర్, జూలై 31 ప్రభాతవార్త : సీజనల్‌వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ వారు ప్రతి ఆదివారం నిర్వహించే శుభ్రత పరిశుభ్రత కార్యక్రమాన్ని ఈ ఆదివారం సనత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ వర్షాకాలం సందర్భంగా పలుచోట్ల నీరు నిల్వ ఉండడం వల్ల వైరల్ ఫీవర్స్, డెంగ్యూ జ్వరాలు వస్తున్నాయని అందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి కెసిఆర్ మంత్రి కెటిఆర్, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ వాళ్ళతో ప్రతి ఆదివారం ఇంటింటికి వెళ్ళి శుభ్రత పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తు, మరీ ముఖ్యంగా ఎవరి ఇంటిని వారు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని వర్షాకాలాపు నీరు ఎక్కడ కూడా నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు మన ఇళ్ళల్లో కూడా శుభ్రంగా ఉంచుకున్నప్పుడు మనకు వచ్చే వైరల్ ఫీవర్ వ్యాధులని అరికట్టవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ కొలను బాల్‌రెడ్డి, ఏఈ భాస్కర్, ప్రభాకర్, పురుషోత్తం, ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మహాసభలకు హాజరుకండి

**ఎంపిలకు జాజుల ఆహ్వానం**



హైదరాబాద్ జూలై 31 ప్రభాతవార్త : ఈ నెల 7వ తేదీన ఢిల్లీలో జరగనున్న జాతీయ ఓబిసి మహా సభలకు అతిథులుగా హాజరు కావాలని పలువురు నేతలను తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం నాడు టిఆర్ఎస్ పార్లమెంటరీ పక్షనేత కె. కేశవరావు, బిజెపి రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర పిసిసి ప్రచార కమిటి ఛైర్మన్ మధు యాష్కీలకు ఆహ్వాన లేఖలను అందజేసినట్లు జాజుల తెలిపారు. చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు ఏపి నుండి ఎంపిలు మారగాని భరత్, కింజారపు రాం మోహన్ నాయుడు సహా దేశవ్యాప్తంగా 10 వేల మంది బిసి ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరవుతున్నారన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు చేయూత

**టిఆర్ఎస్ నేత గొట్టిముక్కల వెంకటేశ్వరరావు**

వివేకానందనగర్‌కాలనీ, జూలై 31, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు చేయూత లభిస్తుందని టిఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కూకట్‌పల్లి డివిజన్ వెంకట్‌రావు నగర్‌కు చెందిన బి.సుధారాణి గర్భసంచి ఆపరేషన్ నిమిత్తం సురక్ష హాస్పిటల్‌లో చేరి ఆపరేషన్ చేయించుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధికి కూకట్‌పల్లి తెరాస సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ద్వారా దరఖాస్తు చేసుకోగా ఇరవై నాలుగు వేల రూపాయలు మంజూరుకాగ, దానికి సంబంధించిన చెక్కును టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, పవన్, అర్బాజ్, సైదలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి దర్శనానికి భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు



**ఉజ్జయినీ మహాకాళి అమ్మవారు**

బేగంపేట జులై 31, ప్రభాతవార్త : సికింద్రా బాద్ ఉజ్జయినీ మహా కాళీ ఆలయంలో శ్రావణ మాస శోభ స్పష్టంగా కనివించింది. ఆదివారం ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయానికి తరలి వచ్చి అమ్మను దర్శించు కుని పూజలు నిర్వహించారు.శ్రావణ మాసంలో వచ్చిన మొదటి ఆదివారం కావడంతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తుల రద్దీ కొనసాగింది.ఈ సందర్భంగా ఆలయంలో ఈఓ గుత్తా మనోహర్ రెడ్డి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా ఏర్పాట్లు చేసారు. ఆషాడ బోనాల జాతర సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నాలుగు క్యూలైన్ల ద్వారా భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయం లో దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా అమ్మ వారిని సులువుగా దర్శించుకున్నారు.

## ప్రధాని పిలుపుపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం

హైదరాబాద్, జూలై 31 ప్రభాతవార్త : ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మన్ కి బాత్ లో ఇచ్చిన పిలుపు మేరకు ఆజాదీకి అమృత్ మహోత్సవంలో భాగంగా జాతీయ జెండాను ప్రొఫైల్ పిక్చర్‌గాను, అలాగే జాతిని జాగృతం చేసేందుకు సోషల్ మీడియాలోనూ విస్కృత ప్రచారం చేయాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి ఓబిసి మోర్చా జనరల్ సెక్రటరీ కేశబోయిన శ్రీధర్ పిలుపు నిచ్చారు. ఇప్పటికే మన్ కి బాత్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని ఈ పిలుపునిచ్చిన విషయాన్ని కేశబోయిన శ్రీధర్ ప్రస్తావిస్తూ రేపటి నుండి ఆగస్టు 15 వరకు సోషల్ మీడియాలో విస్కృత ప్రచారం చేయాలని బిజెపి కార్యకర్తలకు సూచించారు.